# గ్రామాల్లో బిజెపి నాయకులను ప్రజలు సర్పంచ్ లుగా గెలిపించాలి

- గ్రామ పంచాయతీలు నడిచేది కేంద్రం నిధులతోనే
- రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదు
- బిజెపి మండల అధ్యక్షుడు ఏముల నవీన్
- కోటగిరి సర్పంచ్ అభ్యర్థిగా బిజెపి మండల అధ్యక్షుడు ఏముల నవీన్



**కోటగిరి,దీక్ష ప్రభ:** గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వడం లేదని గ్రామపంచాయతీ వ్యవస్థ మొత్తం కేంద్రం నిధులతోనే నడుస్తుందని బిజెపి మండల అధ్యక్షుడు ఏముల నవీన్ అన్నారు.కోటగిరి మండల కేంద్రంలో బిజెపి పార్టీ తరపున మండల బిజెపి అధ్యక్షుడు ఏముల నవీన్ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. శనివారం తన మద్దతు దారులతో ర్యాలీగా కోటగిరి గ్రామ పంచాయతీలోని నామినేషన్ కేంద్రానికి వచ్చిన ఏముల నవీన్ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ..బిజెపి రాష్ట్ర నాయకులు ఎండల లక్ష్మీనారాయణ,బాన్సువాడ నియోజకవర్గ నాయకులు కోనేరు శశాంక్, రాష్ట్ర యూత్ బీజేపీ నాయకులు పటేల్ ప్రసాద్ సూచనల మేరకు కోటగిరి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నట్లు చెప్పారు. కోటగిరి మండల కేంద్రంలోని బిజెపి నాయకులు,కార్యకర్తలతో పాటు గ్రామంలోని అన్ని వర్గాల ప్రజల సహకారంతో సర్పంచ్ ఎన్నికల్లో జయ కేతనం ఎగరవేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. కోటగిరి గ్రామ ప్రజలందరూ తనను ఆశీర్వదించి మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం గ్రామపంచాయతీలకు వచ్చేవి కేవలం కేంద్రం నిధులు మాత్రమేనని రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని చెప్పారు. గ్రామపంచాయతీలో జరిగే పనులన్నీ కేంద్రం నిధులతోనే జరుగుతున్నాయని సిసి రోడ్లు, డ్రైనేజీలు అన్ని కేంద్రం నిధులతోనే వేయడం జరుగుతుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తూ గ్రామపంచాయతీలను రక్షిస్తుందని చెప్పిన ఆయన బిజెపి బలపరుస్తున్న తనను ఆశీర్వదించాలని కోరారు. గ్రామాల్లో ప్రజలందరూ బిజెపి నాయకులకు ఓట్లు వేసి సర్పంచ్ లుగా గెలిపించాలని కోరారు.అప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి వచ్చి గ్రామపంచాయతీలకు నిధులు ఇస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు.



# సబ్ జైల్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జూనియర్ సివిల్ జడ్జి వి.దివ్య

**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** నందికొట్కూరు ఉపకారగారాన్ని జూనియర్ సివిల్ జడ్జి వి దివ్య తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జైలులోని ముద్దాయిలతో మాట్లాడుతూ.. న్యాయవాది లేనివారికి ఉచితంగా లోక్ అదాలత్ ద్వారా ఏర్పాటు చేస్తామన్నారు. 70 సంవత్సరముల వయసు పైబడిన వారు ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు. ఏదైనా సమస్యలు ఉన్నచో జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా గాని, ఆన్లైన్ నెంబరు 15100 ద్వారా గాని తెలపవచ్చునన్నారు. అనంతరం భోజన వసతులు, వైద్య సదుపాయాలు గురించి ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జైలు అధికారి జి.చంద్రశేఖర్,మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే...అభివృద్ధి చేస్తా



- సీనియర్ జర్నలిస్ట్, బీఆర్ఎస్ నాయకుడు తేల్ల రవి

**కోటగిరి,దీక్ష ప్రభ:** కోటగిరి గ్రామ ప్రజలు ఆశీర్వదించి తనను గెలిపిస్తే సర్పంచ్ గా కోటగిరి గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని సీనియర్ జర్నలిస్ట్ బిఆర్ఎస్ నాయకుడు తేల రవికుమార్ అన్నారు. శనివారము కోటగిరి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో ఆయన కోటగిరి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ..జర్నలిజంలో అపారమైన అనుభవం ఉన్న తాను అన్ని ప్రభుత్వ శాఖలపై అవగాహనతో పనిచేసి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తారని చెప్పారు. గ్రామ ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు. ప్రజలందరూ ఆశీర్వదించి తమ అమూల్యమైన ఓటును వేసి తనను గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానని చెప్పారు.

# బస్వాపూర్ సర్పంచ్ బరిలో పుట్టా శ్రీధర్



**కోటగిరి,దీక్ష ప్రభ:** కోటగిరి మండలం బస్వాపూర్ గ్రామ సర్పంచ్ బరిలో సీనియర్ నాయకుడు పుట్ట శ్రీధర్ నిలవనున్నారు. బస్వాపూర్ గ్రామంలో జనరల్ రిజర్వేషన్ రావడంతో ఆయన నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..తాను గతంలో గ్రామానికి ఎంతో అభివృద్ధి చేశానని ప్రజలు అవకాశం ఇచ్చి ఆశీర్వదిస్తే సర్పంచ్ గా గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు.గతంలో ఉప సర్పంచ్ గా పనిచేసిన పుట్ట శ్రీధర్ ఈసారి సర్పంచ్ గా గెలిచి తన సత్తా చాటాలని ప్రయత్నిస్తున్నారు. గ్రామంలో కుల మతాలకు అతీతంగా ఆయన చేసిన సేవలు ఆయనను విజయతీరాలకు చేరిస్తాయని గ్రామ ప్రజలు చెబుతుండడం విశేషం..

# పోతంగల్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

- యూత్ కాంగ్రెస్ నాయకుడు గంధపు రాజు
- పోతంగల్ సర్పంచ్ బరిలో గంధపు అశ్విని



**కోటగిరి,దీక్ష ప్రభ:** తమని ఆశీర్వదిస్తే పోతంగల్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని యూత్ కాంగ్రెస్ నాయకుడు గంగపురాజు అన్నారు. పోతంగల్ మండల కేంద్రానికి బిసి మహిళా రిజర్వేషన్ రావడంతో తన భార్య గంధపు అశ్వినిని బరిలోదించుతున్నట్లు తెలిపారు. శుక్రవారం గంధపు రాజు తన అనుచరులతో భారీ ర్యాలీగా నామినేషన్ సెంటర్ కు వచ్చి తన భార్య గంధపు అశ్విని తో నామినేషన్ వేయించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ..ప్రజలు ఆశీర్వదిస్తే పోతంగల్ గ్రామాన్ని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఆయన వెంట మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జుమ్మా ఖాన్ తదితరులు ఉన్నారు.

# తహసిల్దార్ శివరాం కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండల తహసీల్దారు శివరామ్ తండ్రి శనివారం అకాల మరణం చెందడం జరిగినది. విషయం తెలుసుకున్న నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య కర్నూలు పట్టణంలోని వారి స్వగృహం నందు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పగిడ్యాల మండల కన్వీనర్ మహేశ్వరరెడ్డి పాల్గొనడం జరిగింది.





# కోటగిరి సర్పంచ్ బరిలో యూత్ లీడర్ జుబేర్

**కోటగిరి,దీక్ష ప్రభ:** కోటగిరి గ్రామ సర్పంచ్ బరిలో మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి అత్యంత సన్నిహితుడు ప్రముఖ వ్యాపారవేత్త జుబేర్ అహ్మద్ నిల్వనున్నారు. శనివారము తన మద్దతు దారులతో జుబేర్ నామినేషన్ కేంద్రంలో వచ్చి నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. కోటగిరి గ్రామంలో ప్రజల మద్దతుతో సర్పంచ్ గా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. గత 10 ఏళ్ళుగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పనిచేస్తూ కోటగిరి గ్రామంలో చురుకైన కార్యకర్తగా ప్రజలందరితో మమేకమై ఉన్నానని చెప్పారు. ప్రజలు అభివృద్ధి చేసే నాయకులకు అవకాశం ఇవ్వాలని కోరారు. తనను ఆశీర్వదిస్తే ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు సహకారంతో కోటగిరి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని చెప్పారు.రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలందరూ తమ అమూల్యమైన ఓటును తనకు వేసి ఆశీర్వదించాలని కోరారు.

# జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయండి



**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** నందికొట్కూర్ జూనియర్ సివిల్ జడ్జి వి.దివ్య స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులతో మరియు పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా 13-12-2025 వచ్చే నెలలో జరిగే జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని జడ్జి కోరారు. రాజి అయ్యే సివిల్ మరియు క్రిమినల్ కేసులలోని కక్షిదారులతో లోక్ అదాలత్ లా గురించి అవగాహన కల్పించి అప్పిలు లేని తీర్పులను పొందవచ్చు అని వారన్నారు.ఈ యొక్క సదవకాశాన్ని నంది కొట్కూరు ప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవచ్చు అన్నారు. ఇందుకు న్యాయవాదులు మరియు పోలీస్ అధికారులు సహకరిం చాలని వారు తెలిపారు.ఈ యొక్క కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు జె.వెంకటరాముడు, విజయలక్ష్మి, మద్దయ్య, మరియు ఎస్ఐ లు కోర్టు కానిస్టేబుళ్లు సిబ్బంది పాల్గొన్నారు.

# టిడిపి కేంద్ర కార్యాలయంలో పిజిఆర్ఎస్లో

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వినతి పత్రం
- జైన్ పరిశ్రమను ప్రారంభించి తంగడంచ భూములు అభివృద్ధి చేయాలి
- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు



**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** నందికొట్కూరు నియోజవర్గం జుపాడు బంగ్లా మండలం తంగడంచ ఫారం 1600 ఎకరాల ప్రభుత్వ భూములను అభివృద్ధి చేయాలని, మీ చేతుల మీదుగా ప్రారంభించిన జైన్ పరిశ్రమ, మెగాసిడ్ పార్కును అభివృద్ధి చేయాలని ఇక నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ శనివారం టిడిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎన్నో సంవత్సరాల నుండి తంగడంచ ఫారం భూములను నమ్ముకుని దాదాపు 12 గ్రామాల ప్రజలు ఉపాధి కోసం యువత ఎదురు చూస్తున్నారని గతంలో ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో మీరు మెగాసిడ్ పార్క్,జైన్ పరిశ్రమను ప్రారంభించారని అయితే అభివృద్ధికి నోచుకోక ఆ భూముల అడవిని తలపిస్తున్నాయని భూములు అభివృద్ధికై సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో అనేక ఆందోళన కొనసాగించినప్పటికీ పట్టించుకునే పరిస్థితి లేదన్నారు.ఈ భూములు అభివృద్ధి చేస్తే నందికొట్కూరు నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య పూర్తిగా తీరుతుందని ఆ వైపున కృషి చేయాలని వారు కోరారు.గతంలో యువ గళం పాదయాత్రలో నారా లోకేష్ జైన్ పరిశ్రమను సందర్శించి అధికారంలోకి వస్తే పరిశ్రమను ప్రారంభించి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారని వారు అన్నారు.తక్షణమే ఈ ప్రాంత ప్రజల అభిప్రాయం మేరకు ఈ భూముల అభివృద్ధికి నాంది పలికి నిరుద్యోగ యువతీ యువకులకు రైతులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు వినతి పత్రం అందించారు.

# నందికంది ఆలయ నిర్మాణ వైభవాన్ని ఆస్వాదించిన గీతం ఆర్కిటెక్చర్ విద్యార్థులు





- నక్షత్ర ఆకారపు లేఅవుట్, నిష్పత్తులు, క్లిష్టమైన శిల్పాల అధ్యయనం



**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ మొదటి సంవత్సరం విద్యార్థులు సంగారెడ్డి జిల్లాలోని చారిత్రాత్మక నంది కంది ఆలయానికి స్కెచింగ్ విహారయాత్ర చేసి, దాని నిర్మాణ వైభవాన్ని ఆస్వాదించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు శ్రుతి గవాలి, సందీప్ కాసిన మార్గదర్శకత్వంలో, విద్యార్థులు ఆలయ నక్షత్ర ఆకారపు లేఅవుట్, దాని నిష్పత్తులు, క్లిష్టమైన శిల్పాలను అధ్యయనం చేశారు. ఆచరణాత్మక స్కెచింగ్ ద్వారా డిజైన్ అంశాలను నిశితంగా పరిశీలించడానికి, అర్థం చేసుకోవడానికి, డాక్యుమెంటు చేయడానికి వారిని ప్రోత్సహించారు. ఇది దృశ్య, జ్ఞాపకశక్తిని పదును పెట్టడంతో పాటు, డిజైన్ సున్నితత్వాన్ని బలోపేతం చేసేందుకు దోహదపడింది. విలక్షణమైన రేఖాగణితం, అద్భుతమైన రాతి నైపుణ్యానికి ప్రసిద్ధి చెందిన నంది కంది ఆలయం, సాంప్రదాయ భారతీయ వాస్తుశిల్పంలో రూపం, నిర్మాణం, అలంకారాల సామరస్యాన్ని అర్థం చేసుకోవడానికి స్ఫూర్తిదాయకమైన అభ్యాస వాతావరణంగా తోడ్పడింది. ఈ సందర్శన యువ వాస్తు శిల్పులలో అనుభవపూర్వక అభ్యాసంతో పాటు, వారసత్వ కట్టడాల గొప్పతనాన్ని తెలుసుకోవడానికి ఉపకరించింది. ఇటువంటి క్షేత్ర సందర్శనలు సాంకేతిక సామర్థ్యాన్ని పెంపొందించడమే గాక, భారతదేశ సాంస్కృతిక వారసత్వం పట్ల లోతైన అవగాహన, అపేక్షలను పెంపొందిస్తాయని అధ్యాపక సమన్వయకర్తలు అభిప్రాయ పడ్డారు. నిర్మాణ సారాన్ని సంగ్రహించగల సామర్థ్యానికి నిదర్శనంగా విద్యార్థుల స్కెచ్ లు నిలవడమే గాక, తరగతి గది భావనలను వాస్తవ ప్రపంచ అన్వేషణతో అనుసంధానించాయి.

# పోచారం సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తాము

- సర్పంచ్ అభ్యర్థి ఉదయ్ భాస్కర్
- హంగర్గా సర్పంచ్ బరిలో ఉదయ్ భాస్కర్

**కోటగిరి,దీక్ష ప్రభ:** హంగర్గా గ్రామ సర్పంచ్ బరిలో మాజీ సర్పంచ్ ఉదయ్ భాస్కర్ మరో మారు నిలవనున్నారు. హంగర్గా గ్రామ సర్పంచ్ బిసి జనరల్ కు రిజర్వేషన్ రావడంతో ఉదయ్ భాస్కర్ మరోసారి సర్పంచ్ గా పోటీ చేయనున్నారు. శనివారం ఉదయ్ భాస్కర్ తన అనుచరులతో భారీ ర్యాలీగా హంగర్గా నుండి పోతంగల్ గ్రామపంచాయతీ వరకు వెళ్లి పోతంగల్ గ్రామపంచాయతీలో ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రంలో నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ..గత 20 ఏళ్లలో హంగర్గా గ్రామాన్ని తమ కుటుంబీకులు మూడుసార్లు సర్పంచ్గా పనిచేసే ఎంతో అభివృద్ధి చేశారని, ఓసారి కోటగిరి మార్కెట్ కమిటీ చైర్మన్గా పనిచేసిన తన తండ్రి పోచారం శ్రీనివాసరెడ్డి సహకారంతో గ్రామ అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు తెచ్చారని చెప్పారు. ప్రజల సూచన మేరకు మరోసారి గ్రామ సర్పంచ్ బరిలో తాను నిలబడుతున్నట్లు చెప్పారు. ప్రజలందరూ మరోసారి తమ కుటుంబీకులను ఆదరించి అమూల్యమైన ఓటును వేసి తనను సర్పంచ్ గా గెలిపించాలని కోరారు.తాను గెలిస్తే ఎమ్మెల్యే పోచారం సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు.



